

# దొంగరాముడు

కాళ్లకూరి శేషగిరిరావు

రైలు బయలుదేరడానికింకా ఐదు నిమిషాలు వ్యవధి ఉంది. స్టేషను కిటకిట కొంచెం తగ్గింది. భోజనానికి దిగినవారంతా నెమ్మదిగా తమ తమ పెట్టెలు చేరుకొంటున్నారు. టిక్కట్టు కొనుక్కొని వెతుక్కుంటూ ఫస్టుక్లాసుపెట్టెవద్దకు వచ్చాను. నా సామాను ఒకమఫ్లరుమాత్రమే. ఉల్ఫాగా వచ్చిన ట్వీడుసూటూ, ఈవినింగ్ క్యాపు, మెడకి మఫ్లరూ; నన్ను చూసి ఎవడో పెద్ద ఉద్యోగి అనుకోక తప్పదు.

ఫస్టుక్లాసుపెట్టెముందు కిటికీవద్ద ఒక పెద్దమనిషి నిలుచొని పెట్టెలోని తన భార్యకు వీడ్కోలిస్తున్నాడు. అతన్ని చూడగానే ఆఫ్ డ్యూటీలో వున్న ఒక రైల్వే ఉద్యోగి అని వెంటనే కనుక్కున్నాను. నేను పెట్టె తలుపువద్దకు రాగానే బెదురుకళ్లతో అతని భార్య నావైపు చూసింది. ఆయనా కొంచెం పరీక్షగా చూసి, నెమ్మదిగా ఆమెతో 'భయపడకు, ఎవరో పెద్దమనిషే ననుకుంటాను' అన్నాడు. చిన్న చిన్న శబ్దాలను కూడా ఆనవాలుపట్టే నా చెవులలోకి ఈ మాటలు ఇట్టే దూరాయి. ఏమీ ఎరగనట్లు తలుపు తెరుచుకొని ఆమూల కిటికీవద్ద చతికిలపడ్డాను. ఆమె అనుమానంగా నాకేసి రెండుమూడుసార్లు చూసి ఊరుకుంది.

గార్డు విజిల్ ఇవ్వడం, 'ఇంక ఉంటా' అని ఆయన వెనక్కి తప్పుకోడం, నిండు గర్భిణిలా రైలు ఒక్క చిన్న ఊపుతో కదలడం, ఒకనూటువ్యక్తిఒగర్చుకొంటూ తలుపు తోసుకుని లోపల ప్రవేశించడం దాదాపు ఒకేక్షణంలో జరిగాయి. అతన్ని చూస్తూనే హఠాత్తుగా కొయ్యబారినట్లైపోయి నోరు వెళ్ళబెట్టు కూర్చుంది ఆవిడ. అతనుమాత్రం త్వరగా వచ్చి నా ఎదురుగా కూర్చుని, మొహం రెండుచేతుల్లోను మూసుకు వళ్లో పెట్టుకున్నాడు, ఏడుస్తున్నట్లుగా. నేను మాత్రం ఏచింతా లేకుండా కిటికీలోంచి ప్రతీ ఫర్లాంగుకు కాపలాఉన్న పోలీసుల్ని చూసి నవ్వుకున్నాను.

ఒక చిటిక వినిపించి పక్కకు చూసాను. ఆమె నన్ను తనపక్కకు రమ్మని సైగ చేసింది. లేచి ఆమెపక్కకు వెళ్ళాను. వెళ్ళగానే దాదాపు నా చెవిలో 'వాడెవరో మీకు తెలుసా?' అని అడిగింది. అతన్ని పెట్టెలోకి రాగానేచూసి 'ఎక్కడో చూసినట్లుందేమిటబ్బా'అనుకున్నాను. కాని జ్ఞాపకం రాలేదు. ఆవిడ ప్రశ్నకి 'నాకు తెలియదు' అని సమాధానం చెప్పాను. 'ఆ! తెలీదూ? వాడేనండీ దొంగరాముడు' అంది, 'ఆ!' అని ఆశ్చర్యపోయాను. అవును నాకు బాగా తెలుసు. రెండేళ్ళక్రితం గుంటూరులో రెండు హత్యలుచేసి అప్పటినుంచీ పోలీసుల్ని తప్పించుకు తిరుగుతున్న దొంగరాముడు వీడే. నిన్న మధ్యాహ్నం ద్రోణాచలంలో పోలీసులకి కనిపించి తప్పించుకున్నాట్ట. ఈ లైనంతా అందరికీ అతని ఫోటోలు పంపించి పూర్తిగా పోలీసు నిఘా పెట్టేశారు. మా ఆయన వాడి ఫోటో చూపించారు. వీడేనండీవాడు' అంది. తెగ కంగారు పడిపోతూ. రెండేళ్లనాటి ఆ సంగతి, ఇదుగో పులి అంటే అదిగో తోక అనే పోలీసుల బారినుండి తప్పించుకుంటూ తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోనేందుకు రామారావు (దొంగరాముడు!) పడేపాట్లు, ఈ రెండేళ్ళు తన జీవితాన్ని రక్షించుకోవడంకోసం అతను చేయవలసి వచ్చిన అక్రమాలూ నా మెదడులో మెరిశాయి. అతనివేపు ఇంకోసారి చూసి, ఆమెతో 'బాగా చూశారా లేక పొరబడ్డారా?" అని అడిగాను. "అబ్బే వాడేనండి" అంది ఇంకొంచెం ఖంగారుగా. మా మాటలు కొంచెం చెవినిబడ్డాయేమో ఒకసారి మాకేసి కొరకొరా చూసి, అటు ముఖం తిప్పేసుకున్నాడతను. "ఐతేమాత్రం మనకేం భయమండీ. దిగువ మెట్టలో ఆగగానే వాణ్ని పట్టించేస్తే సరి" అన్నాను నవ్వుతూ. "ఆ అంతవరకూ వాడుండడండీ. ఈ లోపలే మనని దోచేసి పారిపోతాడు, అందావిడి "నన్ను దోచడానికి నావద్ద ఏమీ లేదు. మీ కూడా ఆ లెదర్ సూట్ కేసాక తేగాఎందుకూభయం"అన్నాను

# ★ దొంగరాముడు ★

"ఇంకానయం, ఆ సూటు కేసులో దాదాపు పదివేల రూపాయలు ఖరీదుచేసేనా ఆభరణా లన్నీ ఉన్నాయి" అందామె, వణికిపోతూ. "ఆ, నేను వుండగా మీ కెందుకూ భయం" అని ఆవిణ్ని ఊరడించి నా సీటు లోకివచ్చి కూరుచున్నాను. ఆమె భయమూ ఆభయంలో నన్నునమ్మి తనవద్దనున్న విలువ గురించి చెప్పేయడమూ నాకు నవ్వు తెప్పించాయి.

రైలువేగం హెచ్చుతూంటే నాకు కునికి పాట్లు రావడం మొదలు పెట్టాయి. చదువు తున్న పత్రికని మూసేసి కళ్లు మూసు కొన్నాను. ఆమె త్వరత్వరగా నా వద్దకు వచ్చి "నిద్ర పోకండోయ్" అంది. ఆమె కేసి ఏమీ భయం లేదన్నట్లు చూసి మళ్ళీ కళ్లు మూసుకొన్నాను. ఎంత సేపయిందో తెలియదు. చక్కటి కునుకుపట్టింది. ఆ కలత నిద్రలో ఓ కల. పోలీసులు నన్ను తరుము తున్నారట, నేను పరుగెత్తి పారి పోతున్నాను. ఇంతలో ఓ పోలీసు హఠాత్తుగా వచ్చినా మీద పడ్డాడు. ఉలిక్కిపడి మేలుకొన్నాను. వళ్లు ముచ్చె మటలు పోసేస్తున్నై. నా ఎదురుగుండా కూర్చున్న వ్యక్తి తనమోకాలునాడొక్కలో తన్నిపెట్టి రెండు చేతుల్తోను మెడపట్టు కున్నాడు. నిద్రమత్తు పూర్తిగా వదలని నాకు ఇదొక పీడకలలా అనిపించింది. ఆ సమయంలో నాశక్తిఅంతా ఉడిగిపోయినట్లై అతనిచేతిలో కీలుబొమ్మలా ఐపోయాను. అతను ఒకచేత్తో నాపీక నొక్కుతూ రెండోచేత్తో నాటైనివిప్పి నాచేతుల్ని గట్టిగా కట్టివేశాడు. తర్వాత నా మఫ్లరుతో నాకాళ్లని బంధించాడు. వెంటనే నా జేబు లన్నీ వెదికి నాపర్సునీ, నాపాకెట్ బుక్కునీ తన జేబులో వేసుకున్నాడు. శక్తిహీనంగా నేను నాపాకెట్ బుక్ లో డబ్బేమీ లేదనీ, దాన్ని వదిలేయమని అన్నాను. కోపంగా ఓసారి చీదరించి, నా కోటుజేబులోని రుమాలు నానోట్లోకుక్కి నన్ను ఓములగా పడేశాడు. ఆమె తనమూలలో అలాగే కొయ్యబారిపోయి కూర్చొని ఉంది. అతను పళ్లు ఇకిలించి నవ్వుతూ, "మీ సూట్ కేసు లోని నగలకోసమే ఈపని చేయవలసి వచ్చింది, క్షమించండి, అని పై బెర్తులో ఉన్న ఆమె సూట్ కేస్ ని తీసుకొని, తలుపు తెరిచి మెట్లపైనుంచున్నాడు. రైలు శబ్దాన్నిపట్టి చెలమకీ, బొగదకీ మధ్యనున్న టనెల్ ప్రాంతంలోకి వస్తున్నట్లు పసి కట్టాను. అటనెల్ వద్ద రైలు కొంచెం నెమ్మదిగా నడుస్తుంది. ఈ విషయం ఇతనికి బాగా తెలుసు గామోసు ఆటనెల్ ను రైలు ప్రవేశించగానే క్రిందకి దూకేస్తాడు అను కుంటూ. టనెల్ ఇవతలికి వచ్చేటప్పటికి అతను లేడు.

ఆమె ఇంకా అలాగే వెర్రిమొహం వేసుకుని తెల్లబోయి చూస్తోంది. కళ్ళతో నన్ను విడుదల చేయవలసిందిగా సైగచేసాను. ఇంతవరకూ నాజీవితంలో ఇటువంటి అను భవం జరగలేదేమో, మనసులో సిగ్గుతో కుంచించుకు పోతున్నా. ఇంక తప్పదు గాబట్టి ఆమెకు సైగచేయవలసి వచ్చింది. ఆమె నెమ్మదిగా లేచి, కళ్లుతుడుచుకుని, నాకట్లు విప్పింది. విప్పుతూనే ఆమె మాట వినకుండా నిద్రపోయినందుకు ఛెడామడా తిట్టిపోసింది. నావల్లే తన పదివేల రూపా యల వస్తువులూ పోయాయట. కట్లువిడవ గానే లేచి, ఒళ్లు దులుపుకొని ఆమెకు క్షమాపణ చెప్పుకున్నా 'వాడే దొంగరాము డండీ అని చెవినిల్లుకట్టుకుని పోరినా అలా బండనిద్రపోయారే' అని తిట్టింది. వాడు దొంగరాముడు కాడనుకున్నాను. ఐనా ఏం చేస్తాడులే అని అనవసరంగా ధైర్యపడ్డాను క్షమించండి' అని వేడుకున్నాను.

మళ్లీ కిటికీదగ్గర కూర్చుని ఆలోచించడం మొదలుపెట్టాను. వెధవపర్సు పోతేపోయింది బాధలేదు. దాంట్లో ఉన్న డబ్బు మహాఐతే ఓ పదిరూపాయలుంటుందేమో. కాని పాకెట్ బుక్కుకూడా లాక్కుపోయాడు ఎలాగ? దాంట్లో నా ఉదంతమూ, నా మిత్రుల చిరునామాలు అన్నీ ఉన్నాయి. అవికనక ఎవరిచేతుల్లోఅన్నా పడ్డాయంటే ఇంకేమైనా ఉంది? సర్వనాశనం. ఇప్పుడు ఏంచెయ్యాలి? ఎలాగైనా వాణ్ని నా స్వంత చేతుల్తో పట్టుకొని ఆ పాకెట్ బుక్ లాగే యాలి. ఇంకో పావుగంటలో దిగువమెట్ట వస్తుంది. కాని నా మిత్రుల్ని నన్ను కంభంలో కారుతో కలుసుకోమని వ్రాశాను. ఆ కారేగనుక దిగవమెట్టదాకా వస్తే ఎంతబాగుండేది. అనిపించింది. పోనీ కంభందాకా వెళ్లిపోయి కారుమీద వాడి కోసం వేట ప్రారంభిద్దామంటే చాలా ఆలస్యమైపోతుంది. ఈలోపల వాడు ఎక్కడికైనా తప్పించుకు పోవచ్చు. అదీగాక ఈవిడ గొడవొకటి. అసలే ప్రతీ స్టేషన్లోను పోలీసుకాపలా ఉంది. దిగువమెట్టలో రైలాగగానే ఈవిడ గొడవపెట్టకా తప్పదు. పోలీసులు మా పెట్టెమీద మూగకా తప్పదు. మధ్య 'వీడెవరూ' అనే ప్రశ్నా తప్పదు. వెంటనే ఒక యోచన తళుక్కుమని మెరి సింది. ఆవిడవద్దకువెళ్లిచూడండి నామూలంగా మీ కింత నష్టంరావడం నాకు చాలాబాధగా ఉంది. మీరు చెప్పినట్లు వాడే దొంగ రాముడు అయి వుంటాడు. అందువల్ల వాణ్ణి పట్టుకోవాలంటే వెంటనే మనం దిగువ మెట్టలో దిగిపోయి పోలీసు రిపోర్టుఇవ్వాలి. మీకు చాలా నష్టం అయింది. నాకుగూడా దాదాపు రెండు మూడు వందల రూపాయలు పోయాయి. అందువల్ల ఏమైనాసరే వాణ్ని పట్టుకు తీరాల్సిందే. స్టేషనులో రైలాగగానే గట్టిగా గొడవపెట్టి పోలీసుల్ని పిలవండి. నేను మీ స్నేహితుణ్నినో, బంధువనో చెప్పి నన్ను కట్టివేసి మీ సూటుకేసు, నా పర్సు కొట్టేసి దొంగరాముడు బాగదవద్ద దిగిపోయా డనీ, వాణ్ని వెంటనే వెళ్తే పట్టుకోగలరనీ చెప్పండి. వాడు సరిగ్గా ఎక్కడ దిగి పోయాడో వారికి తెలియబర్చడంకోసం నన్ను కూడా వెంటతీసుకు వెళ్ళవల్సిందని కూడా చెప్పండి. నాకు పెద్దపనేమీ లేదు. నేను కూడా వారితోవెళ్ళి మీకుచేసిన అప కారాన్ని సరిదిద్దుకుంటాను' అన్నాను. నా మాటలు ఆమెకు చాలా రుచించాయనికూడా గ్రహించాను. కొంచెం ముందు నన్ను పట్టుకు తిట్టినా (ఆడదికదూ) తర్వాత నా మాటకు పచే అంది.


## అతిమూత్ర వ్యాధి నెమ్మదించును

మూత్రంలో చక్కెరపోవటం అతిమూత్ర వ్యాధి (DIABETES) అంటారు. ఇది ఎంత ఉపద్రవకరమైన వ్యాధి అంటే, దీని పాలబడినవారు అరోజుకారోజుమృత్యువుకు ఆసన్నమౌతుంటారు ఈజబ్బు లక్షణాలలో ముఖ్యమైనవి ఎక్కువగా దాహం, ఆకలి, తరచుగా చక్కెరతోగాని, లేక చక్కెరలేకుండగాని మూత్రం బయలు వెడలటము, దురద మొదలైనవి. వీనస్ ఛారమ్ అనేక సంవత్సరములు పరిశోధవల ఫలితంగా తయారు కాబడినది. దీన్ని వాడటంవల్ల వేనకు వేల మందిమృత్యుముఖమునుండి బయటపడ్డారు. దీన్ని వాడితే రెండవలేక మూడవ రోజు నుండేమూత్రంలో చక్కెర తగ్గించి. అత్యధిక మూత్రంకూడా నివారిస్తుంది మూడురోజుల తర్వాత మీకు బాగా తేలిక ఇస్తుంది దీనికి పత్యంలేదు. ఇన్ జెక్షన్లు అవసరం లేదు. వివరములు గల ఇంగ్లీషు కరపత్రానికి వ్రాయండి. ఉచితంగా పంపెదము.

50 బిళ్లల బుడ్డి ఖరీదు రు. 6-12-0 లు.

ప్యాకింగు పోస్టేజి ఉచితము.

Venus Research Laboratory(A,P,W)
P. O. Box No. 587, Calcutta.

నేను చెప్పినట్లే సరిగ్గా జరిగింది. ఆమె దిగువమెట్టలో రైలాగగానే పెద్దగొడవ పెట్టేయడం, పోలీసులు రావడం, నన్ను తన స్వంత మేనత్త కొడుగ్గా ఆమె వాళ్ళకి పరిచయపర్చడం, ఆమె గొడవలో వాళ్లు నన్ను సరిగ్గా పరికించకుండా ఆమె మాటలకు విలువివ్వడం జరిగాయి. ఆమె ఆరాత్రికి దిగువమెట్ట స్టేషన్ మేస్టరు ఇంట్లో ఉండడానికి ఒప్పందం జరిగింది.

ఇప్పుడు బొగదకి ఎలా వెళ్ళడమా అని తర్జనభర్జన వచ్చింది. ఇరవైమంది పోలీసుల్తో వేన్‌లో వెళ్లమని ప్రోద్బలంచేశారుకొందరు. కాని నేను వేన్‌లో వెళ్తే ఆలస్యమనీ, ఇద్దరు ఆఫీసర్ల సహాయం వస్తే జీప్‌లో వెళ్లాలనీ అన్నాను. చివరికి నేను చెప్పిందే సరియైనదనీ ముందు మేము జీప్‌లో వెళ్ళి వాడి ఆచూకీ తీయడానికి ప్రయత్నించడానికీ, మేము వెళ్లిన అరగంటలోగా ఇరవైమందితో వేన్ బయలుదేరి మాకోసం బొగద స్టేషన్లో ఉండిపోడానికీ ఒప్పందం జరిగింది.

ఈలోగా నేను స్టేషన్ మేస్టర్ని అడిగి దిగువ మెట చెలమలకి మధ్యనున్న రోడ్ ట్రాన్సుపోర్టు మ్యాపు చూసాను. ఈ ప్రాంతంలో ఈ రైల్వే లైన్‌గాక నంద్యాల వెళ్లే రోడ్డు ఒకటిఉంది. దీనిమీద అక్కడక్కడ రెండు మూడు కాలిదార్లు తప్ప ఇంకో రోడ్డు లేదు. ఈ కాలిదార్లుకూడా అరణ్యప్రాంతంలోకి వెళ్తాయి కాబట్టి అంతలాభించవు. మరి మన మిత్రుడు ఏవిధంగా తప్పించుకోడానికి ప్రయత్నిస్తాడు? అతని వేషాన్నిబట్టి ఈప్రాంతంవాడు కాదేమోననిపించింది. ఇదెగనుక నిజమైతే వాడు ఏదోవిధంగా మళ్లీ రైలు ప్రయాణానికే సిద్ధపడతాడు. కాని ఇంకో ఏడెనిమిది గంటలదాకా రైళ్లేమీ లేవు. అంతవరకూ వాడెక్కడ ఉంటాడా అని ఆలోచించాను. వాడు రెండింట్లో ఏదో ఒకపని చేసిఉండాలి. టనెల్ వద్ద రైలు దిగగానే కొండ ఎక్కేసి బస్ కోసం చూసి, ఏ బస్సైనా వస్తే నంద్యాలవైపుకి గాని లేదా దిగువమెట్ట వైపుకుగాని వెళ్లడానికి ప్రయత్నించాలి. ఎంత పిచ్చివాడైనా ఈ వైపుకి రావడానికి సాహసించడు అందువల్ల నంద్యాలవైపుకే వెళ్లి ఉండాలి. స్టేషన్లో వాకబుచేస్తే నంద్యాల వెళ్లేబస్సు ముప్పావు గంట క్రితమే వెళ్లిందని చెప్పారు. అంటే మేము జీప్‌లో దానిని చెలమ దాటగానే కలుసుకోగలమన్నమాట. ఈ బస్సు బహుశా బొగదవద్ద వాడికి అందేవుండవచ్చు. రెండవది వాడు బొగదప్రాంతాల్లోనే ఎక్కడో దాగుకొనిఉండి రైల్లో వెళ్లడానికి ప్రయత్నించాలి. నాకు మొదటిపద్ధతే బాగా నచ్చింది. ఎందుకంటే రెండవదాంట్లో చాలా చిక్కులున్నాయికాబట్టి. అందువల్ల మేము (నేను, ఇద్దరు పోలీసు



# ★ దొంగరాముడు ★

ఇన్‌స్పెక్టర్లు) జీప్‌లో బయలుదేరగానే, వాళ్లతో అరవై డెబ్భైమైళ్లి స్పీడులో చెలమవైపుకి పోనీయమని చెప్పాను. 'అబ్బే, వాణ్ని బోగదదగ్గిరే కాయాలయ్యా' అన్నారు వాళ్లు. 'కాదు, నా మాట వినండి, చెలమకి 'పోనియ్యండి' అన్నాను. పోలీసుల్ని అందులో అటు బెజవాడనుండి ఇటు గుంతకల్లు, అటు మెడ్రాసు, ఇటు విశాఖపట్నంవరకూ ఉన్న పోలీసుల్ని రెండేళ్లబట్టీ తిప్పలు పెడ్తున్న దొంగరాముణ్ని పట్టుకోబోతున్నామన్న ధీమాతో ఈ ఇన్‌స్పెక్టర్లు ట్రాఫిక్ రూల్సుని గూడా అతిక్రమించి జీప్‌ని డెబ్భైమైళ్ళ స్పీడుతో లాగేశారు. అందువల్ల చెలమదాటిన ఐదు మైళ్ళ లోగానే నంద్యాలవెళ్ళే బస్సుని మేము కలుసుకోగలిగాం. వెంటనే బస్సు ఆపి వాళ్ళిద్దరూ సోదాచేస్తుంటే, నేను కండక్టర్‌ని అడిగాను. 'ఆ కాఫీరంగు ఉలన్ కోటు వేసుకున్న పెద్దమనిషి ఎవరైనా బోగద టన్నెల్ వద్ద ఎక్కాడా' అని. వెంటనే వాడు 'ఆ, సరిగ్గా అక్కడే అలాంటాయన ఎక్కి చెలమ బస్‌స్టాండు వద్ద దిగిపోయారండి' అన్నాడు. ఈలోపల వెర్రిమొహాలతో ఆ ఇన్‌స్పెక్టర్లు నావద్దకు వచ్చారు. నేను జరిగిందిచెప్పి, బస్సుని దాని దారిన వెళ్ళనిచ్చి, జీప్‌ని వెనక్కి తిప్పించాను. ఇంతవరకూ నేననుకున్నట్లుగానే జరిగింది. బోగదలో బస్సెక్కడమూ చెలమ వద్ద దిగడమూ. కాని అతనిప్పుడు ఎక్కడ దాక్కున్నాడు? ఇంకో రైలు రావడానికి ఆరుగంటలు వ్యవధి వుంది. చెలమనుండి బోగద ఎనిమిదిమైళ్ళు మాత్రమే. అంటే త్వరగా నడిస్తే రెండున్నర గంటలకన్నా ఎక్కువపట్టదు. వాడుకూడా నాలాగే ఆలోచించేవాడైతే చెలమలో దిగి, కాలి నడకన ఏమాత్రం అవసరంవున్నా పొదల్లో దాక్కుంటూ బోగదవచ్చి రైలుకి వతల ఎక్కడైనా దాక్కుని రైలెక్కడానికి ప్రయత్నించాలి. దీనివలన ఎంత తెలివయిన పోలీసైనా సరే బోల్తాపడి చెలమప్రాంతాల్లోనే తచ్చాడుతాడుకాని ఏబోగదనుంచి వాడుబస్సుమీద ఇక్కడదాకా వచ్చాడో ఆ బోగదకి కాళ్ళీడ్చుకుంటూ తిరిగి వెళ్తాడని అనుకోడు.

చెలమలో వాడు దిగేటప్పటికి 4 గంటల 5 నిమిషాలు ఐందట. మేము తిరిగి చెలమ వచ్చేసరికి నాలుగు గంటల 45 నిమిషాలైంది. చెలమ బస్సుస్టాండులో వాడు టీ త్రాగి రోడ్డుమీద కొంచెం బోగదవైపుగానే నడిచినట్లు ఆచూకీతీసాం. అంటే వాడు సరైన నడకసాగించేసరికి 4-10 ఐఉంటుంది. 4-20 కల్లా మా జీపు వాడికి కనిపించి ఉండాలి. అంటే ఒక ఐదు నిమిషాలవరకూ వాడు నడక చాలించి దాక్కుని ఉండాలన్నమాట. అంటే ఇప్పటికి వాడు అరగంటసేపు నిర్భయంగా నడిచి ఉండాలి. అంటే దాదాపు రెండు మైళ్ళు అని లెక్కపెట్టుకోవచ్చు. దీన్ని నేను ఆధారంగా తీసుకొని డ్రైవింగ్ తీసుకొని తిరిగి బోగదవైపు ప్రయాణం సాగించాను. ఈ నా పథకం ఏమాత్రం అర్థం కాలేదు పాపం ఈ ఆఫీసర్లకి. అందుకే నా నడవడికి ఆశ్చర్యపోయి, నేనే అపద్బాంధవుడిలా నా మాటబట్టే నడిచారు. వారికే ఈమాత్రం తెలివుంటే నేను వారిముందు కూర్చుని ఇలా డ్రైవింగ్ చేస్తూ ఉండేవాణ్నా?

సరిగ్గా రెండుమైళ్లు రాగానే కారుని ఆపి దిగి రోడ్డు పరీక్షించాను. వెంటనే ఒక్క పెద్ద నవ్వు నవ్వాలనిపించింది. నాకున్న ఊహవల్ల ఆ వ్యక్తి రైలుపెట్టె ప్రవేశించగానే అతను సరికొత్త బాటాబూట్సు తొడుక్కున్నట్లు గ్రహించాను. నేను కారు ఆపిన చోటే రోడ్డుపక్కన ఉన్న బురదలో ఆ ఆ బూట్లగుర్తు కనిపించింది. అంతేకాదు. ఆ గుర్తు రోడ్డుపక్కనేఉన్న దిబ్బమీదకి దారితీసింది. దిబ్బనిండా ముళ్ళూ అవీ ఉన్నాయి. అంటే వాడు ఆ దిబ్బ ఎక్కడానికి కారణం మా జీపుని చూడడమన్నమాట. అంటే ఇప్పుడు వాడు ఆ దిబ్బ అవతల ఎక్కడో ఉన్నాడన్నమాట. అందుకే నాకంత సంతోషంవేసింది. వెంటనే వాళ్ళిద్దర్నీ పిలిచి, సంగతంతా చెప్పాను.

వాణ్ని పట్టుకుందాం అని చంకలెగరేసుకుంటూ వచ్చారేగాని, వాడు ఇక్కడ ఓ ఫర్లాంగులోగా ఉన్నాడనేసరికి తెల్లమొహం వేశారు వాళ్ళిద్దరూను. అప్పుడు వారిలో ఒకరివద్ద రివాల్వరు తీసుకొని, వాళ్ళలో ఒకతన్ని రోడ్డుకు ఎగువగా ఓ ఫర్లాంగులోనూ, రెండవఅతన్ని దిబ్బమీద కారువద్ద ఉండమని నియమించి, నేను ఎప్పుడు రివాల్వరు పేలుస్తానో ఆ క్షణం వారిద్దరూ అది వచ్చిన దిక్కుగా పరిగెత్తి రావలసిందిగా చెప్పి, బయలుదేరాను.

అతి కష్టంమీద దిబ్బదాటి ఓ ఘోరాటవిలో అడుగుపెట్టాను. ఎక్కడ చూసినా చెట్లు, పుట్టలూ, కాని వాడి అలికిడి ఎక్కడా వినిపించడంలేదు. నేను వచ్చేలోగా వాడు ఈ ప్రాంతాలనుండి పారిపోవడం అసంభవం. అలికిడి లేదుకాబట్టి ఇప్పుడు వాడు పరిగెత్తడం లేదు. అంటే ఏ చెట్టు చాటునో దాగి నాకు ఎసరు పెట్టడానికి ప్రయత్నిస్తున్నాడన్నమాట. నాకు నవ్వు వచ్చింది. రైల్లో నేను నిద్రలో ఉన్నాను కాబట్టి వాడికి లొంగాను. లేకపోతే నేనా ఇలా గొడవలో పడేది? నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ, అన్నివైపులా చూస్తూ 150 గజాలు నడిచాను. ఇంతలో ఐదు గజాల దూరాన్న ఉన్న చెట్టుపక్కని పొదలో చిన్న కదలిక నా కళ్ళకి అనింది. వెంటనే వాడు ఆ చెట్టుచాటున నక్కిన విషయము, నేను ఇంకో రెండడుగులు ముందరకు వేసే నామీదకు దూకడానికి ప్రయత్నించడానికి సిద్ధపడడంలో ఆ పొద కదిలిందనీ కనిపెట్టాను. వెంటనే ఆగి "ఏయ్ మిస్టర్, నువ్వాట్టు వెనక ఉన్న విషయం నాకు తెలుసులేగాని ఇవతలికి రా కొంచం మాట్లాడాలి" అన్నాను. ఏమీ జరగలేదు. కాని రెండోసారి రెట్టించేసరికి, వ్యవహారం ముదిరిందని తెలుసుకున్నాడు "కాబోలు ఇవతలికి వచ్చి నుంచున్నాడు. నేను రివాల్వరును అతనివైపుకి గురిపెట్టి "నీలాంటి తెలివయిన వాణ్ని చూసినందుకు చాలా సంతోషంగా ఉంది. నా పాకెట్ బుక్కూ, ఆవిడ సూట్‌కేసులో నువ్వు తీసుకుని మూటకట్టి పెట్టుకున్న ఆవిడ నగలనూ ఇలాపారేసి నీదారిన నువ్వెళ్ళు. నీకేబాధా లేకుండా నేను చూస్తాను" అన్నాను. ఇంకా అంటూనే ఉన్నాను. అతను ఒక్క ఉరుకున నామీద పడి నా కుడిచేతిలోని రివాల్వర్ని ఎగరేసాడు. కాని నేను నిద్రలో లేనన్న సంగతి మర్చిపోయాడు పాపం. నా కుడిచేతిలోని రివాల్వరు ఆకాశంలోని కెళ్ళడం, నా ఎడమ చేయి అతని గెడ్డం గట్టితనాన్ని చక్కగా గుచిమాడడం, 'చచ్చాను' అంటూ అతను

(63-వ పేజీ చూడండి)

## తెల్ల వెంట్రుక లుండవు

(GOVT REGD).

రంగులనుచూచి మోసపోవద్దు,అది తాత్కాలికము మా సువాసన "మన్‌మోహిని హేర్ ఆయిల్" అనేక వనమూలికలతో ఆయుర్వేద పద్ధతిలో తయారైనది. 70 సం॥ ల వయస్సువరకు వెంట్రుకలను నల్లగా వుంచును. ఇదిగాక మెదడుకు చల్లదనము నిచ్చును, ఉన్మాదము, తలనొప్పి వగైరా జబ్బుల రానీయదు. "జ్ఞాపకశక్తి"ని కంటిచూపును వృద్ధిచేయును, కొద్దిగా నెరసివుంటే ఒక సీసా రు. 5-0-0. 3 సీసాలు రు,12-0-0, సగము నెరసివుంటే ఒక సీసా రు. 6-0-0. 3 సీసాలు రు. 15/- పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రు, 7/- లు 3 సీసాలు రు, 18/- లు పని చేయలేదని ఋజువుపర్చిన పూర్తి సొమ్ము వాపసు చేయబడును. కోరినవారికి పూచీ.

GENERAL LABORATORIES,
(P. W) P.O. Rajdhanwar (H. Bhag.).

# ★ సెప్టెంబరు వీరులు ★

[28 వ పేజీ తరువాయి]

అప్పుడు చావుదెబ్బలుతినాలి – నాశరీరం దెబ్బలికి అసలు వోర్చుకోలేదు; పైగా బోలెడు డబ్బు సంపాయించిన తరవాత కూడా మర్యాదగా బ్రతుకుదామన్నా, తెల్సున్నవాళ్ళు వూరుకోరు; అది మహా దారుణం – ఛా! యిదేంలాభంలేదు–అయినా యింత తక్కువమందిని ప్యాసుచేసారేమిటీ; బహుశా రేపో, యెల్లుండో యింకో లిస్టు వస్తుందేమో అనుకున్నా.

రేడియోలో వార్తలు వస్తున్నాయి; కొత్తలిస్టు విషయం చెపుతారని ఆశగా చూసాను; కాని "...వార్తలు సమాప్తి"అని చల్లగా జారుకున్నాడు; అసలు ప్యాసవలేదు, ప్యాసవలేదు అని యేడవటమే కాని, ఆన్సరు పేపర్లో యేదేనా రాస్తేనా? ఇంక వారం రోజులు పరీక్షలు వున్నాయనగా పుస్తకాలు దులపటం–ఆరోజు రాత్రి తెల్లారేవరకూ ఆ అట్టనుంచి యీ అట్టవరకూ గబగబా తిరగేసి ప్రొద్దున్నే పరీక్షరాస్తే, ఆ దిద్దేవాడు మటుక్కు యేం మాసి మార్కు వేస్తాడూ,–ఇలా కాదు, యీసారి మార్చికి రేపటినుంచే శ్రద్ధగా చదివితే సులువుగా దాటెయ్యొచ్చు. యీ లోపుగా యేదైనా వుద్యోగమూ చూసుకోవచ్చు. యింటిదగ్గరుండే చూసుకోలేనివాళ్ళం, పారిపోయి మటుకు యేంచెయ్యగలం? మళ్లీ వెనక్కిరావటంతప్ప; యీసారి యేమైనాసరే గట్టిగా చదవాలి; యీ ఛాన్సుకూడా చూసి, అప్పుడూపోతే యింక యింట్లో వుండకూడదు; అని సమాధానపడ్డాను.

అయినా యివాళే రావాలీ; యెప్పుడూ నవంబరు మొదటివారంలో వచ్చేవి; యింత త్వరగా వస్తాయని యెవరూ అనుకోని వుండరు; ముఖ్యంగా నేను అనుకోలేదు. ఈమాత్రం భాగ్యానికి యింకో పదిరోజులు ఆగివస్తేమాత్రం యేం మునిగిపోయింది యీ నాలుగు రోజులైనా హాయిగావుండకుండా చెయ్యాలని కానీ, అసలు రిజల్ట్సు రావాలని యేడ్చింది యెవరు!

ఇంతలోనే సాహిత్యాభిరుచి గుర్తుకి వచ్చింది; సాహిత్యంలో అభిరుచి వుందనిపించుకోటానికి, యెన్ని పుస్తకాలు చదివాను! పెద్దపెద్ద రచయితల్ని, వాళ్ళ అనుభవాలు, రచనలు తెల్సుకోగల్గటానికి యింత తీరిక యిచ్చింది యీ సెప్టెంబర్లే కదా? ఈ ఖాళీసమయాల్లో యెంతమంది సాహితీవేత్తలుగా, రాజకీయ నాయకులుగా, కళాజీవులుగా మారిపోయారు; నాతోనే సెప్టెంబరు మార్చీలకి వస్తున్న మిత్రులు మెస్సర్సు రావు, రాజు, మూర్తి, వాలీ, శర్మలు యెంతెంత మంచి మంచి అర్థంకాని వుద్యోగాల్లో వుంటున్నారు. మిస్టరు. రావు "దండోరా" సినీమా పత్రికలో "సబు అసిస్టెంటు జాయింటు యెడిటరుగా" మద్రాసులో వుంటున్నానుఅన్నాడు. వాలి గవర్నమెంటు స్వంతవిషయాల "అండరుసెక్రటరీ" అనిగుర్తు; రాజు ఆత్మహత్యలకమిటి "సలహాదారుడు"గా వుంటున్నాడుట; సుబ్బులుమామచెపుతూవుంటాడుగా–వాళ్ళ క్లాసుమేటు A. K. కి;—అసలుపేరు జంబటె కామయ్యట; రేడియోలో ఎనిమిదివందలు యిస్తారుట–అతను ప్రతీక్లాసు రెండు మూడేళ్ళకు తక్కువ కాకుండా చదువుతూ వచ్చేడుట–యింటరు ప్రాక్టికలు పరీక్ష పేపరులో యెదురుగుండా ప్రయోగంచేస్తున్న అమ్మాయి ముక్కుమీద మచ్చపైన పద్యంరాసి యిచ్చేడుట,–దానికి విశ్వకళాపరిషత్తువారు మూడేళ్ళు డిబారుచేసాము అన్నారుట. కాని దానికే రేడియోవారు పద్యరచన పోటీల్లో అతన్ని ఫస్టుగా సెలక్టుచేసి, వుద్యోగంకూడా యిచ్చారట! – మరి, మాసుబ్బులుమామ యింటరు ఫస్టుక్లాసు; B. A లో డబులు ఫస్టుక్లాసు; అయినా B. Ed కి వెడితే మంచిదేమో అనుకుంటూ, పదేళ్ళుగా కాలేజీలో ట్యూటరుగానే వుంటున్నాడు – మరయితే నేనూ చాలా సెప్టెంబర్లు చూసానుగా, పైగా ప్రపంచంలో వున్న దురాచారాలు, సంఘంలోవున్న కుళ్ళు బాగా అవగాహనచేసుకున్నాను – పరీక్షలు ముందుంచుకొనికూడా క్లాసు పాఠాలు మానేసి అనేక గ్రంథాలు తిరిగేస్తూ వుంటాను. – పైపెచ్చు నిశిత విమర్శనా జ్ఞానానికి లోటులేదు; యిదంతా చూస్తే నాకున్న అపార సారస్వతానుభవంతో ప్రపంచంలో మిక్కిలి అత్యుత్తమ వ్యంగ్యహాస్యవ్యాసరచయితగా తేలిగ్గా పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవచ్చును – ఒకసారి భవిష్యత్తులోకి చూసాను–"స్వర్ణ"ని ఉత్తమ రచయితగా 'విశాల విశ్వం' సన్మానిస్తోంది; నేనూ "జై" అని లేవబోతున్నాను; "పార్కు కట్టేస్తున్నా, బాబూ!" అన్న కేక వినిపించింది. ఒక్కసారిగా, వర్తమానంలోకి వచ్చి, యింక యింటికి వెడదాం; యీ పాటికి Father పడుకొనివుంటారు.– "సెప్టెంబరేట్లు జిందాబాద్"– "సెప్టెంబరు వీరులకే జై"–అనుకుంటూ యింటి ముఖం పట్టాను. ★

# దొంగరాముడు

(20-వ పేజీ తరువాయి)

నేలకి వరగడం ఒక్కసారి జరిగాయి. వెంటనే నేను అతని చేతుల్ని అతని టైతో కట్టేసి అతని జేబులోని నా పాకెట్ బుక్కుని, పదివేల రూపాయల విలువగల ఆమె ఆభరణాల్ని తీసుకుని నా జేబులో వడేసుకున్నాను. ఇలా చేయడంలో అతనిముఖం, అతని ఎడమదవడ మీది చిన్న కత్తిగాటూ నాకు స్పష్టంగా కనిపించాయి. వెంటనే ఇతను వారంరోజులక్రితం మద్రాసులో ఒక ఘోరహత్య గావించిన గోవిందు అని గుర్తు వచ్చింది. అతని ఫోటో ఒక్కసారి మాత్రమే చూడడంవల్ల ఇతన్ని ఎక్కడ చూశానా అని బాధపడ్డాకగాని గుర్తుపట్టలేకపోయాను. ఇదీ మన మంచికే అనుకొని, నాపాకెట్ బుక్కులోని ఒక కాయితం చింపి, దాంట్లో కొంచెం వ్రాసి, అతని కోటు కాలర్కి గుచ్చి, రివాల్వరు తీసికొని ఇంకో ఇరవై గజాలు నడిచాను. అక్కడ ఒక చెట్టుకి రివాల్వర్ని గొట్టంపైకి వచ్చేటట్టు కట్టేసి, అతని జేబు రుమాలు నుండి చింపిన గుడ్డపోగుల్ని ఒక పొడుగైనతాడుగా చేసి, ఒక కొసని రివాల్వర్ ట్రిగ్గరికి కట్టి రెండ కొసని నాతోపాటు తీసుకొని దిబ్బవైపు నడవడం మొదలుపెట్టాను. దిబ్బకి 20 గజాలదూరంలో ఓ చెట్టు చాటున దాక్కొని చేతిలోని కొసని గుంజేసరికి దూరాన్న రివాల్వరు పేలింది. అది పేలిన రెండునిముషాల్లో ఉరుకు లేసుకుంటూ నా ఇనస్పెక్టర్ స్నేహితులు పరుగెత్తడం చూసి, ఒక్క ఉరుకులో జీప్లో ఎక్కి పలాయన మంత్రం పఠించాను. నేను కాగితంలో వ్రాసినది ఇది.

'మిత్రులకు,'

మళ్ళీ కనిపించనందులకు క్షమించవలెను. నాకన్న ఘోరపాపాలు చేసిన గోవిందును ఇదుగో మీకు అప్పగించుచున్నాను. వాడితో తృప్తిపడండి 'ఆమె' నన్ను తన మేనత్తకొడుగ్గా చెప్పుకొన్నందుకు ఆమెకు నేను కృతజ్ఞుడను. నాకవసరం అవడంవల్ల ఆమె నగలను నేను తీసేసుకొంటున్నాను. నాకు మంచిరోజులంటూవస్తే వాటికైన సొమ్ము ఆవిడకు అందజేస్తానని చెప్తూ నన్ను క్షమించమని కోరండి. మీకు నా అభివందనలు. — దొంగరాముడు. ★